www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 17 | జూలై | 2026 పేజీలు : 8

## ఎస్ఐఆర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి




- ఎన్నికల అధికారులు, బిఎల్ఓలకు ప్రజలు సహకరించాలి
- అర్హులైన ప్రతీ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

## ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో
# బిఆర్ఎస్ దోపిడీ చేసింది..



-భూసేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తాం
-సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భద్రత కల్పిస్తాం
-యాతాలకుంటలో సీతారామ ట్రంక్ టన్నెల్ పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో టిఆర్ఎస్ ప్రజాధనాన్ని దోపిడీ చేసిందని, లోప బుయ్యిష్ట నిర్మాణాలతో ప్రాజెక్టును శిథిలం చేస్తే వాటిని సరిదిద్దుకుంటూ ప్రాజెక్టులను నిర్మించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు రాష్ట్ర నీటిపారుదల శాఖ మాత్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. మండల పరిధిలోని యాతాలకుంట సమీపంలోని సీతారామ ట్రంక్ టన్నెల్ పనులను సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆద్వర్యంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి

మిగతా 2లో..



# జాడలేని చినుకు.. వాడుతున్న మొక్కలు..!

-జూలూరుపాడులో నెర్రెలువారుతున్న పంట చేలు
-వరుణుడి కరుణకోసం ఎదురు చూస్తున్న రైతన్నలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వరుణుడు ముఖం చాటేయడంతో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది పత్తికి లభించిన మంచి ధరలు, ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన

మిగతా 2లో..

# 'బెస్ట్' విద్యకు ఆటంకం..!



-ముప్పై రోజులైనా బడిబాట పట్టని విద్యార్థులు
-ప్రైవేట్ స్కూల్స్ నిరాకరణ
-నిధుల విడుదలలో ప్రభుత్వ జాప్యం
-ప్రశార్థకంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్
-పట్టించుకోని జిల్లా యంత్రాంగం

**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం:** పేద, దళిత, గిరిజన విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్య, వసతిని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. గత మూడేళ్లుగా యాజమాన్యాలకు రాష్ట్రప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు పూర్తయినా పిల్లలను స్కూళ్లకు అనుమతించకపోవడంతో బడిబాట పట్టని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల వైఖరి విద్యార్థుల తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 40 స్కూళ్లలో, ఒకటవ తరగతిలో నాన్ రెసిడెన్షియల్‌కు 128, ఐదవ తరగతిలో రెసిడెన్షియల్‌కు 132 సీట్లను కేటాయించారు. ఈ సీట్లకు 300 దరఖాస్తులు రాగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు 33 శాతం, గ్రూప్ 1,2,3 రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయింపు చేసి డ్రా పద్దతిలో 132 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.

### -ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్...

ప్రభుత్వవ నిర్లక్ష్యం, ప్రైవేట్ పాఠశాలల కఠిన వైఖరి వలన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతంలో పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారిని అర్హులుగా తీసుకుంటారు. ప్రతి ఏడాది ఆన్లైన్‌లో దరఖాస్తులో

మిగతా 2లో..

# భావితరాల జీవితాన్ని మలుస్తున్న ఏఐ






**ప్రజాపక్షం/తల్లాడ:** ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు కేవలం సినిమాల్లో మాత్రమే కనిపించిన సాంకేతికత నేడు ప్రతీ మనిషి జీవితంలో భాగమవుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, బ్యాంకింగ్, మీడియా వంటి అన్నిరంగాల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది. భావితరాల జీవన విధానాన్ని పూర్తిగా మార్చే శక్తిగా ఏఐ మారబోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యలో విప్లవాత్మక మార్పులు విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా పాఠాలు చెప్పే స్మార్ట్ లెర్నింగ్ విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా ఏఐ సహాయపడుతోంది. వ్యక్తిగత అభ్యాసానికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతోంది.

- కృత్రిమ మేధతో కొత్త ప్రపంచం
- ఏఐ యుగం...అవకాశాలా? సవాళ్లా?

**- వైద్యరంగంలో కొత్త అవకాశాలు...**

వ్యాధులను ముందుగానే గుర్తించడం, చికిత్సలో ఖచ్చితత్వం పెంచడం, శస్త్ర చికిత్సల్లో వైద్యులకు సమకరించడం వంటి పనుల్లో ఏఐ కీలకపాత్ర పోషిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశాలు పెరుగుతున్నాయి.

**- వ్యవసాయానికి తోడ్పాటు...**

వాతావరణ అంచనాలు, పంటలకు వచ్చే తెగుళ్ల గుర్తింపు, నీటి వినియోగం, ఎరువుల మోతాదు

మిగతా 2లో..

# ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో బిఆర్ఎస్ దోపిడీ చేసింది..

(మొదటిపేజీ తరువాయి)





ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. సీతారామ ప్రాజెక్టు, సాగునీటి అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్ఎస్ పాలనపై పలు వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 67 టీఎంసీల గోదావరి జలాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు సాధించామని తెలిపారు. 2004లో దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించినప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల వంటి కీలక ప్రాజెక్టులను పూర్తిచేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మెడిగడ్డ బ్యారేజ్ కూలిపోవడానికి ఇంజినీరింగ్ లోపాలే కారణమని, మూడు బ్యారేజీల పునాదులను గత ప్రభుత్వం మార్చేసిందని ఆరోపించారు. సాయిల్ టెస్టులు సక్రమంగా నిర్వహించకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా మిగతా రెండు బ్యారేజీలపై ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీలకు రీహాబిలిటేషన్, మరమ్మతుల పనులు చేపడుతున్నామని చెప్పారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో మార్చి ప్రజాధనాన్ని దోపిడీ చేసిందని ఆరోపించారు. పదేళ్లపాటు ప్రజల సొమ్మును వృథా చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జూలూరుపాడు టన్నెల్ పనులను వేగంగా పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను నింపేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం బేషజాలకు పోకుండా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టిందన్నారు. కరువు పరిస్థితులు వచ్చినా ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేసిన ముగ్గురు నాయకులు, ప్రజలను తప్పుదారి పట్టించేలా అవాస్తవ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, భాగం నీరజ చౌదరి, మున్సిపల్ చైర్మన్లు మహమ్మద్ రెహనా కమల్ పాషా, దారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ బొంతు సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాడలేని చినుకు.. వాడుతున్న మొక్కలు..!

(మొదటిపేజీ తరువాయి)



మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న రైతులు భారీగా పత్తి సాగుకు మొగ్గు చూపారు. ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు ఖర్చు చేసి భూములను సిద్ధం చేసి విత్త నాలు వేశారు. విత్తనం విత్తిన తర్వాత గత 20 రోజులుగా వర్షాలు కురవకపోవడంతో చాలా చోట్ల విత్తనాలు నేల లోనే మిగిలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మొలకెత్తిన పంటలు కూడా ఎండిపోతున్నాయి. రెండో, మూడోసారి తిరిగి విత్తనాలు నాటాల్సి రావడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

**బోరు బావులపై ఆధారం....**

మొలకలను కాపాడుకునేందుకు కొందరు రైతులు బోరుబావుల నుంచి లభిస్తున్న కొద్దిపాటి నీటితో పంటను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, నీటి కొరత వెంటాడుతోంది. తీవ్రంగా ఈదురు గాలులు వీస్తుండంతో విద్యుత్ అంతరాయం కూడా తోడు కావడంతో పంటలు కాపాడు కునే ప్రయత్నంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇప్పటికే పెట్టిన పెట్టు బడులు తిరిగి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించినప్పటికీ, కనీసం అడపా దడపా వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు సాగు చేపట్టారు. కానీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

**దేవుళ్లను మొక్కుతున్న రైతులు...**

ఇకనైనా మంచి వర్షాలు కురిసి పంటలు గట్టెక్కాలని రైతులు దేవుళ్లను ప్రార్థిస్తున్నారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తే తక్షణ వర్షా లకు అవకాశాలు కనిపించకపోవడంతో ఈ ఏడాది కూడా వ్యవసాయం అనావృష్టి బారిన పడి రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతామేమోనన్న భయం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా పత్తి సాగు జరిగే జూలూరుపాడు మండలంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వేలాది మంది రైతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న ఈ ప్రాంత రైతులు వర్షాలు లేక ఆందోళన చెందుతున్నారు.

# భావితరాల జీవితాన్ని మలుస్తున్న ఏఐ

(మొదటిపేజీ తరువాయి)

వంటి అంశాల్లో రైతులకు ఏఐ సూచనలు అందిస్తోంది. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

**- ఉపాధిలో మార్పులు**

ఏఐ వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నప్పటికీ పాత తరహా ఉద్యోగాలు తగ్గే ప్రమాదం కూడా ఉంది. కొత్త నైపుణ్యాలు నేర్చుకున్న వారికి మంచి అవకాశాలు లభిస్తాయి.

**- ఏఐ వల్ల కలిగే ప్రధాన లాభాలు**

పనులను వేగంగా ఖచ్చితంగా పూర్తి చేయగలదు. సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో నాణ్యత పెరుగుతోంది. ప్రమాదకర పనులను యంత్రాల ద్వారా నిర్వహించవచ్చు. పరిశోధనలు, ఆవిష్కరణలు మరింత వేగవంతమవుతాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు త్వరగా అందే అవకాశం ఉంటుంది. వికలాంగులకు సహాయక సాంకేతికలు అభివృద్ధి చెందుతాయి.

**- ఏఐ వల్ల ఎదురయ్యే సమస్యలు**

కొన్ని ఉద్యోగాలు తగ్గే ప్రమాదం ఉంది. తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్ వీడియోలు పెరిగే అవకాశం ఉంది. వ్యక్తిగత గోప్యతకు ముప్పు ఏర్పడవచ్చు. సైబర్ నేరాలు మరింత అధునాతనంగా మారే అవకాశం ఉంది. ఏఐపై అతిగా ఆధారపడితే మానవ ఆలోచనా శక్తి తగ్గే ప్రమాదం ఉంది. విద్యార్థులు స్వయంగా ఆలోచించే అలవాటు కోల్పోయే అవకాశం ఉంది. సాంకేతిక అసమానతలు పెరిగే అవకాశం ఉంది.

**- నిపుణుల సూచనలు**

ఏఐను పూర్తిగా తిరస్కరించడం సరైన మార్గం కాదు. అదే సమయంలో దానిపై పూర్తిగా ఆధారపడటం మంచిది కాదు. సాంకేతికతను మానవ విలువలతో సమతుల్యం చేస్తూ వినియోగిస్తేనే సమాజానికి మేలు జరుగుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు ఏఐ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భావితరాల జీవితంలో ఏఐ ఒక విప్లవాత్మక మార్పుకు నాంది పలుకుతోంది. సరైన నియంత్రణ, బాధ్యతాయుత వినియోగం, నైతిక విలువలతో ఏఐను ఉపయోగిస్తే అది మానవ అభివృద్ధికి గొప్ప సాధనంగా నిలుస్తుంది. అయితే దానివల్ల కలిగే ప్రమాదాలును కూడా గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరం. సాంకేతికను మానవ సంక్షేమానికి ఉపయోగించగలిగితేనే భావితరాల భవిష్యత్ మరింత సురక్షితంగా, అభివృద్ధి దిశగా సాగుతుంది.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్‌లో గల తన నివాసంలో గురువారం ఆయన ఎన్యూమరేషన్ పత్రాన్ని స్వయంగా నింపి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి ఎన్నికల అధికారులు, బిఎల్‌ఓలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రతీ పౌరునికి ఓటు హక్కు అనేది అత్యంత విలువైన ఆయుధం అని, దేశ భవిష్యత్‌ను నిర్ణయించే బాధ్యత ఓటుపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జనార్ధన్, ఆర్ఐ జి నర్సింహారావు, విఆర్ఓలు బాలాజీ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# ‘బెస్ట్’ విద్యకు ఆటంకం..!

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. డే స్కాలర్ కింద రూ.28వేలు , రెసిడెన్షియల్‌కు రూ.42 వేలు ఫీజుగా ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ఉచిత అందించడం కోసం అమలు చేస్తున్న ఈ స్కీమ్‌లో ఒకసారి ప్రవేశం పొందితే పదో తరగతి వరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ఉచిత అందించడం కోసం అమలు చేస్తున్న ఈ స్కీమ్‌లో ఒకసారి ప్రవేశం పొందితే పదో తరగతి వరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్‌యూనిఫాం ఉచితంగా అందిస్తుంది. అయితే మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజుల చెల్లింపులో జాప్యం కారణంగా తమపై ఆర్థిక భారం పడుతుందని, పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుకోలేమని స్కూల్ యాజమాన్యాలు తేల్చిచెబుతున్నారు. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**-బడ్జెట్ వచ్చే వరకు చేర్చుకోం...**

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద ప్రైవేట్ స్కూల్లో అడ్మిషన్ల కోసం ఈ ఏడాది ఎప్పటిమాదిరిగానే ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, లక్కీడ్రా నిర్వహించి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించేంత వరకు విద్యార్థులను చేర్చుకునే ప్రసక్తి లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే ఈ స్కీం కింద రెసిడెన్షియల్‌లో చదువుతున్న పాత విద్యార్థులను సైతం తాము చెప్పేంత వరకు స్కూల్ రావొద్దని యాజమాన్యాలు స్పష్టం చేశాయి. ప్రైవేట్ యాజమాన్యాల వైఖరితో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థుల, వారి తల్లిదండ్రుల బడులు తెరిచి సుమారు నెల రోజులు కావస్తున్న తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు అడ్మిషన్స్ అనుమతించడం లేదని వాపోయారు. తమకు రావాల్సిన బిల్లులు వచ్చే వరకు విద్యార్థులను చేర్చుకోలేమని తేల్చి చెప్తున్నారు. వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థులను స్కూళ్లలో చేర్చుకోవాలని, లేదంటే ఆందోళన చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## ఖమ్మం డిసిసిబికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామీణ రుణాల పంపిణీ, సహకార పాలన (కో ఆపరేటివ్ గవర్నెన్స్), ఆర్థిక సమగ్రత (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) రంగాల్లో విశిష్ట సేవలు అందించి ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) రాష్ట్రంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన డిసిసిబి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. 45వ నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ ఐఏఎస్, నాబార్డ్ హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయభాస్కర్ చేతుల మీదుగా ఖమ్మం డిసిసిబి సిఈవో ఎన్. వెంకట ఆదిత్య ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. గ్రామీణాభివృద్ధి రైతులకు రుణాల పంపిణీ, సహకార సంఘాల బలోపేతం, పారదర్శక పాలన, ఆర్థిక సేవలను ప్రజలకు చేరవేయడంలో ఖమ్మం డిసిసిబి కనబర్చిన అత్యుత్తమ పనితీరు కు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు సిఈవో మాట్లాడుతూ ఈ గౌరవం బ్యాంకు పాలక మండలి, అధికారులు, ఉద్యోగులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్), అన్ని భాగస్వాముల సమిష్టి కృషి, అంకిత భావం, నిబద్ధతకు దక్కిన గుర్తింపని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులు, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ సహకార రంగ అభివృద్ధికి కృషి కొనసాగిస్తామన్నారు.

## రైతులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కరకగూడెం:** రైతులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ డిమాండ్ చేశారు. కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో ఉన్న కన్యాపరమేశ్వరి ఫర్టిలైజర్ దుకాణంలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, తుడుం దెబ్బ నాయకులు ఆకస్మికంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు తుడుందెబ్బ తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని, అవసరమైతే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.రైతుల హక్కులను కాపాడడం ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత. రైతులను మోసం చేసే వారిని ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టాలని తుడుందెబ్బ డిమాండ్ చేస్తోంది.

# ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఆహ్వాన సంఘం ఎన్నిక**

**ప్రజాపక్షం/చింతకాని :** ఆగష్టు 20, 21వ తేదీల్లో చింతకాని మండలం కొదుమూరులో జరిగే ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా నిర్మాణ భాద్యులు కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశాన్ని రాఘవాపురం బృందావన్ గార్డెన్‌లో అబ్బూరి మహేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు.ఈ సమావేశంలో కొండపర్తి మాట్లాడుతూ గ్రామస్థాయి నుండే సంఘం బలోపేతం కావాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో యువజన సమాఖ్యను ఏర్పాటు చేసి సంఘాన్ని మండల కమిటీలు ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ముమ్మరంగ ఆసమావేశాలు నిర్వహించి ఆగష్టులో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణ భాధ్యతలను సర్యవేక్షించేందుకు ఆహ్వాన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దూసరి గోపాలరావు,




సహాయ కార్యదర్శులుగా దొబ్బల వెంగళరావు, అబ్బూరి మహేష్, కొల్లి రవి, కార్యదర్శి వర్గ సభ్యులుగా నక్కనబోయిన కృష్ణ, చిట్టిమోదు కొండలరావు, సింగారపు సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, ఏనుగు గాంధీ, పగడాల మల్లేష్, పావులూరి మల్లి ఖార్జున్, కూచిపుడి రవి, రంజిత్ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు గణపారపు ఉపేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి , చింతల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం శ్రావణ్, నాయకులు మహేష్, కొల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేళ్లచెర్వు ముత్తమ్మ సంస్మరణ సభ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుకు చెందిన సిపిఐ సీనియర్ సభ్యురాలు మేళ్లచెర్వు ముత్తమ్మ సంస్మరణ సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముత్తమ్మ చిత్రపటానికి సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో భాగం మాట్లాడుతూ...ముత్తమ్మ సిపిఐ పార్టీ సిద్ధాంతాలను విశ్వసిస్తూ జీవితాంతం పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన సేవలు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పార్టీ చేపట్టిన ఉద్యమాలు, ప్రజా పోరాటాల్లో ఆమె చురుకుగా పాల్గొని కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె చూపిన సేవా స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకొని పార్టీ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర



మంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మాజీ ఎంపీపీ, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి మేళ్లచెర్వు లలితతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**-సుడా ఛైర్మన్ పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సుడా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం సుడా కార్యాలయంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్, వైస్ ఛైర్మన్ అభిషేక్ అగస్త్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్రంగా సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్లు, కాలువల పురోగతిని తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుడా పరిధిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. సుడా మాస్టర్ ప్లాన్ ప్రక్రియను వేగవంతం చేసి వచ్చే గురువారం నాటికి డిస్పాచ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుడా పరిధిలో సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఖమ్మంలో ఉక్కుపాదం.. గ్రామాల్లో యథేచ్ఛగా...

**బెల్ట్ షాపులపై ఎక్సైజ్ చర్యలు కార్పొరేషన్‌కే పరిమితమా..?**

**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లాలో బెల్ట్ షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ చర్యలు అసహనంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలే కొత్తగా భాధ్యతలు చేపట్టిన డీసీ సోమిరెడ్డి ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలో బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికి ,మండల కేంద్రాలు , గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో గుడి, బడి తేడా లేకుండా రేయింబవళ్ళు బెల్ట్ షాపులు తెరిచి యధేచ్ఛగా మద్యం విక్రయాలు సాగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. మహిళలు, విద్యార్థులు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బెల్ట్‌లకు ఎంఆర్‌పీ కంటే రూ.10 నుంచి రూ.25 అదనం**

జిల్లాలోని మద్యం దుకాణాలు రెండు కౌంటర్‌లు ఏర్పాటు చేసి రిటైల్ కౌంటర్‌లో మందు బాబులకు ఎంఆర్‌పీకి అమ్మకాలు చేదుతున్నారు. మరో కౌంటర్‌లో బెల్ట్ షాపు వారికి ఎంఆర్‌పీకి అదనంగా ప్రాంతాన్ని బట్టి రూ. 10 నుంచి రూ.25 వరకు అదనంగా వసూలు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. రిటైల్ కౌంటర్‌లో లిమిటెడ్ బ్రాండ్స్ ఉండగా బెల్ట్ కౌంటర్‌లో మాత్రం అన్‌లిమిటెడ్ స్టాక్, కావాల్సిన బ్రాండ్‌లు దొరుకుతాయి. ఉదాహరణకు దుకాణాల్లో కింగ్‌ఫిషర్ బీర్ దొరకదు కానీ మారుమూల పల్లెటూరు బెల్ట్ షాపులో మాత్రం కావాల్సినన్ని అదనపు ధరకు దొరుకుతాయి.

**సోమిరెడ్డి మార్క్ కార్పొరేషన్ కే పరిమితమా ?**

నగరంలో ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ శాఖ గ్రామీణ ప్రాంతాల్లో అదే కఠినత్వం ఎందుకు చూపడం లేదనే ప్రశ్నలు తలెత్తున్నాయి. చట్టం అందరికీ ఒకటే అయితే, అమలు కూడా జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు. దేవాలయాలు, పాఠశాలలు వంటి సున్నిత ప్రాంతాల సమీపంలో మద్యం విక్రయాలను అరికట్టి భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..

**అనధికారిక బెల్ట్ షాపులపై చర్యలు తప్పవు .. సోమిరెడ్డి (డిప్యూటీ కమీషనర్ ఖమ్మం)**

బెల్ట్ షాపులు నిర్వహించచడం చట్ట రిత్యా నేరం. జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటాం. మద్యం ధరలు ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మడం నేరం ఎవరైనా అమ్మకాలు చేస్తే ఫిర్యాధ్యు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# అక్రమ పట్టాను రద్దు చేయాలి

**-కొడుకు, మనవడి నుంచి రక్షించాలి**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అక్రమంగా చేయించుకున్న పట్టాను రద్దు చేయాలని, కొడుకు, మనవడి నుండి రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితుడు శివలా అధికారులను వేడుకున్నారు. కూసుమంచి మండలం రావిచెట్టు తండాకు చెందిన శివలా తన కోడలు తేజావత్ తులసీబాయి తో కలిసి ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కూసుమంచి రెవెన్యూ పరిధిలోని తమ వ్యవసాయ పొలంలో సాగు చేస్తుండగా తన కుమారులు, కోడళ్లు కలిసి నాపై దాడి చేసి విచక్షణరహితంగా కొట్టి చంపుతామని బెదిరించారని శివలా తెలిపారు. తనకు ప్రాణ హానీ ఉందని రక్షణ కల్పించాలని కోరారు. తులసీబాయి మాట్లాడుతూ గత నెల ఐదున ఆదివారం సాయంత్రం తమ పొలంలో వరినారుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లానని అదే సమయంలో మా మామ చేనును ట్రాక్టర్‌తో దున్నేందుకు మా బావ ఆయన కుమారులు వచ్చారని ఆ పొలాన్ని మా మామను భయపెట్టి బలవంతంగా లాక్కున్నారన్నారు. అట్టి పొలాన్ని నాకు కౌలుకు ఇచ్చారని అతని బాగోగులు కూడా మేమే చూసుకుంటున్నామన్నారు. రెండేళ్ల క్రితం నా భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయారని నాకు అండగా ఉండేవారు ఎవరు లేరని గ్రహించి నా పై, నా కూతుళ్లపై దాడికి పాల్పడుతూ అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని మీ అంతు చూస్తాం చంపి అయినా సరే మీ పొలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వారి నుంచి మాకు రక్షణ కల్పించి మా భూమిని మాకు అప్పగించాలని కోరారు.

# స్కూల్ ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోని ప్రైమరీ స్కూల్ ప్రహారీగోడ నిర్మాణం పనులకు మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.10లక్షలు మంజూరు చేసి అట్టి పనులకు గురువారం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్, కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రామారావు, సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, ఏఎంసి డైరెక్టర్ వేల్పుల చెంచయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ దుంప వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర అద్దంకి రవి, తన్నీరు రామకృష్ణ, గ్రామశాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్‌రావు, పోచేపల్లి వెంకట్రావు, గోపి, మీనుగు కృష్ణ, శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం



**ప్రజాపక్షం/ముదిగొండ:** జిల్లాలోని ముదిగొండ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. సీఐ మురళి ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున ప్రత్యేక దాడులు నిర్వహించి, అ క్రమంగా ఇసుక తరలిస్తున్న 13ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పెద్దమండవ, గంధసిరి ము న్నేరు వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో కమలాపురం, చిరుమర్రి, న్యూలక్ష్మీ పురం గ్రామాల సమీపంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 13ట్రాక్టర్లను పట్టుకుని ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, సహజవనరుల దోపిడీని ఎట్టి పరిస్థితిలోనూ సహించబోమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళి హెచ్చరించారు. అక్రమ రవాణాపై సమాచారం అందిచాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ అబ్దుల్ ఖలీక్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఉన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మధిర శాసన సభ్యుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క సిఫారుసుతో వివిధ వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి రూ.2,41,500ల విలువైన చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. దేశబోయిన యశ్వంత్‌కు రూ.60వేలు, ఉసికల వజ్రంకు రూ.35వేలు, పతంగి ఉపేందర్‌కు రూ.46వేలు, ధరావత్ సక్కుభాయికి రూ.39,500లు, పోలోజు దివ్యకు రూ.20వేలు, చెరుకుపల్లి వెంకటేశ్వర్లుకు రూ.41వేలు అందజేశారు.

# కాచవరంలో వైద్య శిబిరం




**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలం కాచవరం గ్రామంలో గురువారం నవశకం ఆధ్వర్యంలో వైద్య శిబిరానిన ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబారాన్ని గ్రామ సర్పంచ్ షేక్.ఫాతిమాభి ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో పలువురు రోగులు వైద్య సేవలు పొందారు. ఈసందర్భంగా సర్పంచ్ షేక్.ఫాతిమాభి మాట్లాడుతూ నవశకం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయటం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నవశకం ఫౌండర్ మేకల రమేష్, గ్రామ సర్పంచ్ రాయల రామచంద్రరావు, గ్రామ పెద్దలు షేక్.మదర్‌సాహెబ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నర్సింహారావు, అంగన్వాడీ టీచర్ గౌరి, ఆశావర్కర్ రోహిని, పోస్ట్‌మాన్ శీరిష, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగకుండా చూడాలి



ప్రజాపక్షం/ఏన్కూరు:మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా ఎక్కువ ఆగకుండా చూడాలని ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. కార్యాలయ మీటింగ్ హాల్‌లో జరుగుతున్న మిషన్ భగీరథ ఆపరేటర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఆమె పరిశీలించారు. ఆపరేటర్ల ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు కరెక్ట్‌గా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆపరేటర్లు ఎప్పటికప్పుడు మంచినీటి సరఫరా నిలిపివేయకుండా చూడాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పల్లి భాగ్యశ్రీ, ఎంపీఓ జీవిఎస్ నారాయణ, మిషన్ భగీరథ సూపర్వైజర్ శరత్ పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: విద్యార్థుల లక్ష్యసాధన కోసం కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి సదానందం సూచించారు. గురువారం సింగరేణి మండలంలోని కేజీబీవీని సందర్శించిన ఆయన 10వ తరగతి విద్యార్థినులతో సూర్య గ్రహణం, చంద్రగ్రహణం వంటి శాస్త్రీయ అంశాలపై చర్చించి, చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. పాఠశాల దశే భవిష్యత్తుకు పునాది అని, అనవసర విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థినుల కోసం కుట్టిస్తున్న ఏకరూప దుస్తుల తయారీని తనిఖీ చేసి, నాణ్యతలో రాజీ పడకుండా వచ్చే వారంలో పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి బాజోజు ప్రవీణ్‌కుమార్, కేజీబీవీ సీఆర్‌టిలు సమీనా, ఝాన్సీ పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక




ప్రజాపక్షం/కూసుమంచి: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)కూసుమంచి మండల అధ్యక్షుడిగా ఉడత వీరబాబు , ప్రధాన కార్యదర్శిగా భూక్యా నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లాలసింగ్ తండాలో నిర్వహించిన మండల మహాసభలో వీరితో పాటు ఉపాధ్యక్షులుగా జిల్లా నాగరాజు, భూక్యా మోహన్, సమాయ కార్యదర్శులుగా గుండెపంగు మధు, బెల్లి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా లింగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అల్లి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఉడత వీరబాబు, భూక్యా నరసింహ మాట్లాడుతూ యువత సమస్యలు, నిరుద్యోగ, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడతామని, గ్రామస్థాయిలో ఏఐవైఎఫ్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు. నూతన కమిటీకి పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

### -యువకుడి మృతి

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన మెరుగు గోపి (27) గత రాత్రి ఎన్ ఎస్పీ రింగ్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు మెరుగు వెంకటస్వామి, వెంకటలక్ష్మి లకు ఆలస్యంగా లేకలేక కలిగిన ఏకైక సంతానం చేతి కందిన దశలో వృద్ధాప్యంలో ఉన్న మమ్ములను పోషిస్తాడని ఆశతో ఉన్న మమ్ములను మధ్యలోనే ముంచేసి వెళ్లడంతో ఆ తల్లిదండ్రులు ఏడుపులు కన్నీరు మున్నీరు గా ఉండడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ ఏడుపులు ఎవరు ఆపలేకపోతున్నారు. ఏకైక సంతానం మరణంతో ఆ కుటుంబాన్ని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, పాలకవర్గాలు కుటుంబాన్ని సందర్శించి భౌతిక దేహానికి నివాళులర్పించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో

## కార్ల షెడ్డులో అగ్ని ప్రమాదం



ప్రజాపక్షం/మణుగూరు:షార్ట్ సర్క్యూట్ తో కార్ల షెడ్డు దగ్ధమైన సంఘటన గురువారం మణుగూరులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని గుట్ట మల్లారం టీవీఎస్ బైక్ షోరూం పక్కన గల కార్ మెకానిక్ షెడ్‌లో షార్ట్ సర్క్యూట్ తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో షెడ్ లో ఉన్న ఒక కారు పూర్తిగా ధ్వంసం కాగా కొన్ని కార్లు స్వల్పగా దెబ్బతిన్నట్లు సమాచారం. అయితే స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మొరాయించింది. ఇంజన్ పని చేయక నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది తలెత్తింది. అక్కడున్న వారు నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాదానికి సంబంధించి షాప్‌లోని స్పేర్ పార్ట్స్ 4 లక్షల రూపాయల విలువ ఉంటుందని షెడ్డు నిర్వాహకులు తెలిపారు.

# మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు భారం..!

### అప్పుల్లో వంట కార్మికులు







ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం తరపున మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీ కార్మికులు విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో కష్టమైనా నష్టమైనా అందిస్తున్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు 58 పాఠశాలలు ఉండగా 95 ఏజెన్సీల కార్మికులు వంటను తయారుచేసి రోజువారీగా కష్టమైన నష్టమైన అప్పైన సప్పైన భోజనాన్ని తయారుచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలుగా అందిస్తూ ఉన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు 3,000 మంది విద్యను అభ్యసిస్తున్నారు. దీనిలో భాగంగా ఒక్కో విద్యార్థికి 16 రూపాయలు లోపు మాత్రమే అందిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నిత్యవసరాలు పెరిగిన కూడా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచనందున తీవ్రంగా నష్టపోతున్నట్లు ఏజెన్సీ కార్మికుల పేర్కొంటున్నారు. ప్రస్తుతం కోడిగుడ్డు ధర ఎనిమిది రూపాయలు ఉండగా ప్రభుత్వం అందించేది. ఆరు రూపాయలు మాత్రమే అదే విధంగా నేటి ధరలను పట్టి కంది పప్పు, ఉప్పు, నూనె, కారం, కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ సమయంలో ప్రస్తుతం ఉన్న ధరలు ప్రకారం ఒక్కో విద్యార్థికి 25 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందని గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలో చేసిన కూడా ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికులను ఇబ్బందులు పెడుతుందని వారు వాపోతున్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా 10000 వేతనం ఇస్తానని ప్రకటించి రెండు సంవత్సరాలు దాటిన కూడా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేస్తానని నేటికీ సరఫరా లేకపోవడంతో కట్టెలు పొయ్యిలు వద్ద పొగతో ఇబ్బందులు పడుతున్నారు.ఈ ఇబ్బందులు తట్టుకోలేక కొంత మంది ఏజెన్సీ కార్మికులు చేతులెత్తేసి ఇంటి బాట పట్టారు. నిత్యవసరాలు కోడిగుడ్డు ఇంకా కట్టెలు అదనపు భారం మధ్యాహ్న భోజనంలో అప్పుల మంటతో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తూ ఇబ్బందులు పాలవుతున్నట్లు వంట కార్మికులు వివరిస్తున్నారు. మెనూ చార్జీలు నిత్యవసరాలను గౌరవ వేతనాలను పెంచాలని ఏజెన్సీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నలబై ఏళ్ల అన్నారుగూడెం వంతెనకి తెర..!

### - సీతారామ ప్రాజెక్టు సాగునీరు తీసుకొచ్చేందుకు కాలువకట్ట వెడల్పు చేస్తున్న వైనం



ప్రజాపక్షం/తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో 40ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనని కూల్చారు. ఆనాడు 1977సంవత్సరంలో ఏన్కూరు నుంచి సాగర్ జలాలు తీసుకొచ్చేందుకు కాలువను తవ్వారు. అందులో భాగంగా గ్రామ ప్రజలు రాకపోకలు సాగించుకునేందుకు ఆనాడు వంతెనని నిర్మించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన జలగం వెంగళరావు హయాంలో ఈ ప్రాంతానికి సాగర్ జలాలు తీసుకురావడంతో రైతులు పంటల సాగు చేసి పండించుకున్నారు. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ జలాలను ఎక్కువ మోతాదులో అంటే సుమారు 750క్యూసెక్కుల నీటిని తరలించేందుకు కాలువ కట్టలను పెద్దవిగా చేసి వంతెనలను కూలగొట్టి నూతన వంతెనలు ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా 40ఏళ్ల క్రితం ఉన్న సుధీర్ఘ అనుభవం ఉన్న వంతెనని మంగళవారం రాత్రి పొక్లేయన్‌తో కుప్పకూల్చారు. అదేవిధంగా నూతన వంతెన చేపట్టేందుకు ఇంజినీర్లు మార్కింగ్ వేస్తున్నారు. సుదీర్ఘకాలంపాటు ఈ ప్రాంతం ప్రజలు రాకపోకలకు అణువుగా ఉన్న వంతెన చరిత్రను గ్రామపెద్దలు తెలియజేస్తున్నారు. కాల్వకట్ట ప్రాంతంలో కొందరు దళితులు ఇళ్ల స్థలాలు కొంతమేరకు పోయే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయం కల్పించాలని దళితులు కోరుతున్నారు.

### సర్ గడువు సమీస్తున్న

## మొద్దు నిద్ర వీడని బిఎల్‌వోలు..!



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సర్ ప్రక్రియ గడువు ముగుస్తున్నా బిఎల్‌వోలు మొద్దు నిద్ర వీడడం లేదు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ, పత్రాల నమోదు ప్రక్రియలో పలువురు బూత్ లెవల్ అధికారులు(బిఎల్‌వోలు) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు సమీపిస్తున్నప్పటికీ కొన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను సకాలంలో నమోదు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కొత్త ఓటర్ల నమోదు, పేరు మార్పులు, చిరునామా సవరణలు, తొలగింపు వంటి ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని అంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు బిఎల్‌వోలు నిర్లక్ష్యంగా ఉండటంతో గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ శాశ్వత ఓటును కోల్పోతామేమోనని భయంతో ప్రజలు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బిఎల్‌వోల నిర్లక్ష్యం విడనాడి గడువు ముగిసేలోపు పెండింగ్‌లోఉన్న అన్ని దరఖాస్తులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ బిఎస్‌వోలకు ఆదేశాలు జారీ చేసినా బిఎల్‌వోల్లో ఎటువంటి మార్పు రావటం లేదు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే బిఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు.

## గ్రామ సమాఖ్యలు అంతర్గత తనిఖీలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న ఐకెపి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధికి నడుస్తున్న గ్రామ సమైక్యలు 2025 26 సంవత్సరానికి గాను 29 గ్రామ సమాఖ్యలలో 2025 అక్టోబర్ నుండి 2026 మార్చి వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలు 14 రకాల నిర్వహణ పుస్తకాలు అంతర్గత తనిఖీలు చేశారు .60 రకాల సమాచారాన్ని అంతర్జాలంలో పొందుపరిచారు .జిల్లా ఆడిటర్స్ జనార్ధన్, వీర స్వామిలు తనిఖీలు నిర్వహించి గ్రామ సమైక్యల అభివృద్ధికి సంఘ సభ్యుల వ్యక్తిగత అభివృద్ధికి సలహాలు సూచనలను వివోఏలకు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీలు వివో ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో ముదురుతున్న అంతర్గత విభేదాలు..!

### -సమావేశాల్లో వాగ్వాదాలు... ఫిర్యాదులతో వేడెక్కిన రాజకీయం -పాలనపై పెరుగుతున్న ప్రశ్నలు.. -అధికారిక వ్యవస్థలో సమన్వయం ఎక్కడ?




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాల్సిన సమయంలో పాలకవర్గంలో నెలకొంటున్న విభేదాలు మున్సిపల్ పాలనపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో బిఆర్‌ఎస్ కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి కాపా మురళీకృష్ణ మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం వివాదానికి కారణమైంది. ఒక మహిళా ప్రజాప్రతినిధితో వ్యవహరించిన తీరు పట్ల కొంతమంది కౌన్సిలర్లు పలు రాజకీయ పార్టీల నాయకులు అప్పట్లో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ వద్ద జరిగిన గొడవ చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలను చర్చించాల్సిన వేదికలు వ్యక్తిగత విమర్శలకు దారితీయడం పట్ల ఆందోళన వ్యక్తమవుతుంది.

### వైస్ చైర్మన్ ఫిర్యాదుతో కొత్త చర్చ...

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ భర్త కాపా మురళీకృష్ణ మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కమీషనర్‌కు ఫిర్యాదు చేయడం మరింత చర్చకు దారితీసింది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల అధికార పరిధిలో ఇతరుల జోక్యం వంటి అంశాలపై పాలకవర్గంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కౌన్సిలర్ల అసంతృప్తికి కారణమేంటి?

మున్సిపల్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి పనుల అమలు, పరిపాలన వ్యవహారాల్లో ఎవరి పాత్ర ఎంతవరకు ఉండాలన్న అంశంపై కొంతకాలంగా అసంతృప్తి ఉందనే చర్చ సాగుతుంది. పాలకవర్గ సభ్యుల మధ్య సమన్వయం లోపిస్తే దాని ప్రభావం నేరుగా ప్రజా సమస్యల పరిష్కారంపై పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### కమీషనర్ మౌనం ఎందుకు?

మున్సిపల్ సమావేశంలో జరిగిన పరిణామాలు, అనంతరం వచ్చిన ఫిర్యాదులపై కమీషనర్ వైఖరి కూడా చర్చనీయాంశంగా మారింది. పరిపాలనాపరంగా స్పష్టమైన చర్యలు లేదా వివరణ ఎందుకు వెలువడలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారులు తటస్థంగా వ్యవహరించి పాలనలో స్పష్టత తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### అసలు పెత్తనం ఎవరిది?

వైరా మున్సిపాలిటీలో ప్రస్తుతం ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గమే నిర్ణయాలు తీసుకుంటుందా? లేక తెర వెనుక మరెవరి ప్రభావం ఉందా? అనే చర్చకు తెరలెపిన ఈ పరిణామాలు భవిష్యత్తులో ఎటు దారి తీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. వివాదాలు, ఆరోపణలు పక్కన పెట్టి ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పట్టన ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న పరిస్థితులపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు పేర్కొంటున్నారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య మహాసభలను విజయవంతం చేయండి

### - 18న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి - మహా ప్రదర్శనకు వేలాదిగా తరలిరావాలి - ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు ముత్యాల విశ్వనాథం




ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ కేంద్రంగా ఈ నెల 18, 19 తేదీలో రెండు రోజుల పాటు జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ, రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని మహా సభల ఆహ్వాన సంఘం గౌరవ అద్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వర రావు భవన్‌లో బి. వెంకట్ అధ్యక్షతన తెలంగాణ గిరిజన సమాఖ్య ముఖ్యనాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సంధర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు వసంతాలు దాటినా గిరిజన బతుకులు మారలేదన్నారు. నేటికీ హక్కుల కోసం పోరాటం చేయాల్సివస్తున్నదని వాపోయారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాసి వేసేందుకు కుట్రలు చేస్తున్నదని, దానిలో భాగంగానే అటవీ సంపదను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్‌తో నక్సలైట్లను తుదముట్టించిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న గిరిజన వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ మహా సభల వేదికగా గళమెత్తాలన్నారు. గిరిజన హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఉమ్మడి పోరాటాలకు మహసభలు నాంది పలకాలని ఆకాంక్షించారు. గిరిజన హక్కుల రక్షణే ద్యేయంగా ఈ నెల 18, 19 తేదీలలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య మహా సభల సందర్భంగా 18వ,తేదీన నిర్వహించే మహా ప్రదర్శన, బహిరంగ సభకు గిరిజనులు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభను ముఖ్య అతిధులుగా అఖిల భారత ఆదివాసీ మహా సభ ఇంచార్జి డి. అనిరాజా, అఖిల భారత ఆదివాసీ మహాసభ జాతీయ ప్రదాన కార్యదర్శిపశుపతి కోల్, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, టిజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి, టిజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బి. వెంకట్, ఆహ్వాన సంఘం కోశాధికారి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శ్రీను, వైఎస్. గిరి, కొంగర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని అరెస్టులు చేసినా బీఆర్‌ఎస్ పోరాటం ఆగదు

### -సీతారామ ప్రాజెక్టుపై ఉప ముఖ్యమంత్రి, ముగ్గురు మంత్రులు సమాధానం చెప్పాలి




ప్రజాపక్షం/బూర్గంపాడు: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బూర్గంపాడు మండల బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రితో సహా ముగ్గురు మంత్రులు ఈ ప్రాజెక్టును సందర్శిస్తున్న నేపథ్యంలో జిల్లా రైతాంగం పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పోలీసులు బూర్గంపాడు మండల బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిశీలనకు జిల్లాకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రులు రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. రైతుల సమస్యలను ప్రస్తావించేందుకు పార్టీ పిలుపునిచ్చిన సమయంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఎన్ని అక్రమ అరెస్టులు, నిర్భంధాలు చేసినా రైతుల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టుపై భారీగా ఖర్చు చేసినప్పటికీ భద్రాద్రి జిల్లా రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా రైతులకు నీరు అందించడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, భద్రాద్రి జిల్లా రైతులను నిర్లక్ష్యం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. గోదావరి జలాలు జిల్లా చివరి ఆయకట్టు వరకు చేరేలా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని, రైతుల సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ. 60,116 విరాళం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా రూ 60,111 విరాళాన్ని అందించారు. ఆళ్లపల్లి ముద్దుబిడ్డగా గుర్తింపు పొందిన షాబీర్ పాషాను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య కలిసి విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న యాదవ సంఘం పెద్దలను వారు అభినందించారు. ఈకార్యక్రమంలో యాదవ కుల సంఘం పెద్దలు ఎల్లబోయిన ఐలయ్య, గోగుల సతీష్, కసనబోయిన బాబు, కసనబోయిన మల్లేష్, దూదిమెట్ల మల్లేష్, ఎల్లబోయిన నవీన్, ఎల్లబోయిన వెంకన్న, ఎల్లబోయిన పెద్ద ఉప్పులయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లపల్లి పీహెచ్‌సీలో శ్రమదానం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ఎం తరుణ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు వైద్యాధికారి ఎం తరుణ్ తెలిపారు.

## ప్రగళ్లపల్లి లిఫ్ట్ పనులు పూర్తయ్యే వరకు పోరాటం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: సీతారామ ప్రాజెక్టు విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు అన్యాయం జరుగుతోందని, దుమ్ముగూడెం మండల రైతుల చిరకాల డిమాండ్ అయిన ప్రగళ్లలిఫ్ట్ ఇరిగేషన్ పనులకు వెంటనే నిధులు కేటాయించి ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు పరిశీలనకు ఉప ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో రైతుల సమస్యలపై ప్రశ్నించేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. రైతుల సమస్యలను లేవనెత్తినందుకు నిర్భంధాలు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు ఉద్యమం కొనసాగుతుందని, గోదావరి జలాలు భద్రాద్రి జిల్లాలో చివరి ఎకరం వరకు చేరేలా చర్యలు తీసుకుని, ప్రగళ్లపల్లి లిఫ్ట్ పనులు ప్రారంభించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, మాజీ పీపీసీ సభ్యురాలు రేసు లక్ష్మీ, పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, లంక శివ, తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టు ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్‌గా మొబగాపు



ప్రజాపక్షం/భద్రాచలం : వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (నేషనల్ యూనియన్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు మొబగాపు ఆనంద్ కుమార్ నియమిస్తూ అధ్యక్షులు రాణాప్రతాప్ రజ్జభయ్యా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు అనీల్ దేశాయ్‌తో కలిసి భద్రాచలం వచ్చిన ఆయన జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి జిల్లా అడహక్ కమిటీని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా మొబగాపు ఆనంద్‌కుమార్, సంయుక్త కన్వీనర్‌గా తోకల నాగేశ్వరరావు, కో కన్వీనర్లుగా కోలే దామోదర్ రావు, లక్ష్మణ్‌లను నియమించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని యూనియన్ బలోపేతానికి పాటుపడదామని కోరారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ దామోదర్ రావుకు యూనియన్ డైరీని అందజేశారు.

## ఎస్ఐఆర్‌ను బాధ్యతగా నిర్వహించండి



ప్రజాపక్షం/గుండాల : ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బాద్యతాయితంగా నిర్వహించాలని బిఆర్‌ఎస్ పార్టీ పినపాక నియోజక వర్గ ఇన్‌చార్జి దిండిగల రాజెందర్ బిఎల్‌ఓలకు సూచించారు. గురువారం విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రజలవద్దకు వెల్లి ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ప్రతి ఓటరు ఓటు పోకుండా జాగ్రతగా వారియొక్క ఫారాలను బిల్‌ఓలకు అందచేయాలని సూచించారు. ఓటర్లకు ఏదైనా సందేహాలు ఉంటే వాటిని వివరించాలని కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుష పాలన సాగిస్తుందని అన్నారు. ప్రశ్నించే కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేసి భయ బ్రాంతులకు గురిచేస్తున్నారని , అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో పార్టి అధ్యక్షులు తెల్లం భాస్కర్, మొకాళ్ళ వీరస్వామి, గడ్డం వీరన్న, రమేష్, సుదాకర్, నాగేశ్వరావు, జాడి ప్రభాకర్, కుమార్, నరేష్, సతీష్, అజ్జు, సతీష్, ప్రమోద్,శ్రీను, కాలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో అవినీతి

**-బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల ప్రగతి**
**-సీతారామ ప్రాజెక్టును సాకారం చేసిన దార్శనీకుడు కేసిఆర్**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నాడు కాంగ్రెస్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గుర్తె కూనరిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు బిఆర్ఎస్ కేసిఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ హయాంలో వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుని జల యజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చారన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసిఆర్ సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి పది లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో సుమారు తొమ్మిదివేల కోట్లు వెచ్చించి 100 కిలో మీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంపు హౌజ్‌లు, పైపులైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని ఆధునీక సామర్థ్యం గల మోటార్లు, ఆధునీక యంత్ర పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించి ప్రాజెక్టు నిర్మాణాన్ని 90 శాతానికి పైగా పూర్తి చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రైతాంగానికి సాగర్ ఆయకట్టుకు శాశ్వత సాగునీటిని అందించడంతో పాటు భూగర్భ జలాల పెంపు, వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేసిఆర్ సీతారామ ప్రాజెక్టును రూపుదిద్దారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు సీతారామ ప్రాజెక్టుకు తాము ఎంత మేర నిధులు ఖర్చు చేశారో, చేసిన కృషి ఏమి లేకపోవడంతో కేసిఆర్, బిఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఎవరి కృషి ఏమిటో వాస్తవాలు ప్రజలకు తెలుసని పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు.

# ఎస్‌బిఐటిలో హ్యాకథాన్ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల్లోని ఆలోచనలను పదును పెట్టే ఉద్దేశంతో ఎస్‌బిఐటి కళాశాల ప్రాంగణంలో హ్యాకథాన్ 2026 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం గురువారం ప్రారంభమైందని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కొత్త విషయాలను ఆలోచించడం సృజనాత్మకత అవుతుందని వాటికి రూపాన్ని ఇవ్వడం ఆవిష్కరణ అవుతుందని ఆయన తెలిపారు. ఆధునీక సమాజంలో విద్యార్థులకు సృజనాత్మకత లేనిదే మనుగడ కష్టమని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హ్యాకథాన్‌లో 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కోడ్ స్యాండ్ బాక్స్ ఏఐ సోర్ క్యాటిక్ టూటర్, ఐపిఎల్ టికెటింగ్ వంటి టీమ్స్‌పై విద్యార్థులు 48 గంటల పరిశోధనాత్మక కోడింగ్ వివరణతో అందించేలా సూచించామన్నారు. రెండు రోజుల అనంతరం విజేతలను ఎంపిక చేసి గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు సృజనాత్మకత మూలమని తెలిపారు. థీమ్‌కు అనుగుణంగా ఏఐను ఉపయోగిస్తూ టూటర్ విధులను నిర్వర్తించే అప్లికేషన్ తయారీ, ఏ కంప్యూటర్ భాష అయిన ఎక్కడి నుండైనా అమలు పరిచే అప్లికేషన్ తయారీ, ఐపిఎల్ క్రీడకు అనుగుణంగా పూర్తి అప్లికేషన్‌ను ఫుల్‌స్టాక్‌లో నిర్వహించడం వంటి సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో క్లారిటీఎడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సిఈవో తాళ్లూరి రాజీవ్‌చంద్ర, కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యూబేషన్ సెల్ ఇంచార్జి డా॥ మురళీమోహన్, పి. అశ్విని, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు సుప్రియ, స్ఫూర్తి, పద్మావతి, ప్రభాకర్, టిపివో సవిత పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/కల్లూరు:** ఆరుతడి పంటలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారిని రూప ఆధ్వర్యంలో నిర్వహించారు. కొన్ని రోజులపాటు వర్షాభావ పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వలన నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి ,చెన్నూరు, ముచ్చవరం, ఎర్రబోయినపల్లి, బత్తులపల్లి, చంద్రుపట్ల, ముచ్చవరం తదితర గ్రామాలలో రోజువారీగా ఆరుతడి పంటలు సాగుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఏవో రూప తెలిపారు. రైతు వేదికల పరిధిలో వ్యవసాయ విస్తరణ అధికారులు సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వరి సాగు తో పాటు పత్తి దసరా మిని మం కంది నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. నీటి వినియోగం సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని నేల సారాన్ని పెంపొందించేందుకు పచ్చిరొట్టల ఎరువుల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన వ్యక్తులు తోడ్పాటు అందించడం అభినందనీయమని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు 29వ వార్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు వెంపటి ఉమావెంకటేశ్వర్లు దంపతులు 20బెంచీలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు, అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తోడుగా ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 20 బెంచీలు అందించిన కౌన్సిలర్ ఉమా వెంకటేశ్వర్లు దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురంమున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు సోమ వెంకటరెడ్డి, దివ్య, కడవ నవీన్, ప్రసాద్, బుర్ర మహేష్, కాంగ్రెస్ నాయకులు నూకల రామ్మోహన్‌రెడ్డి, కొట్టం శిరీష, రంజిత్‌రెడ్డి, వెంపటి సురేష్, గణపారపు వీరన్న, పొన్నెకంటి నర్సింహారావు, మిల్లు ప్రసాద్‌రావు, చారి శేషిరెడ్డి, రాకేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భుజంగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కొక్కు రాజు, రంజిత్‌నాయక్, మేళ్లచెర్వు సురేష్, వడ్లకుంట భుజంగరావు, వేర్పుల వీరయ్య, అట్లూరి వీరబాబు, వేర్పుల జయప్రసాద్‌రావు, ఏపూరి తరుణ్, బొడ్డు హర్షవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలసాగుపై రైతులు దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రస్తుతం ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సీతారామరెడ్డి సూచించారు. గురువారం తిరుమలాయపాలెం మండలంలోని కేశవాపురం, కాకరవాయి, ఏలువారిగూడెం గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు, పంట కుంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, కంది, జొన్న, ఆముదం పంటలను జూలై నెలాఖరు వరకు వర్షాలు లేనట్లయితే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. భూగర్భ జలాలను పెంచుకోవడం కోసం పంట కుంటలను ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీపై ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఐదు ఎకరాల లోపు రైతులు పంట కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పంట కుంటల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సాయికుమార్, సాధన, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 73.62 శాతం పూర్తి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 73.62 శాతం పూర్తయిందని అధికారులు గురువారం తెలిపారు. ఖమ్మం నియోజక వర్గంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 57.33 శాతం, పాలేరు నియోజక వర్గంలో 80.89 శాతం, మధిర నియోజక వర్గంలో 78.27 శాతం, వైరా నియోజక వర్గంలో 78.06 శాతం, సత్తుపల్లి నియోజక వర్గంలో 80.22 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 73.62 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు తెలిపారు.

# వాలంటీర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో (మై భారత్) మేరా యువ భారత్ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాల నిర్మాణం కోసం యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధికారి మద్దుల వెంకట్ రాంబాబు తెలిపారు. దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం, నైపుణ్యాలను మెరుగుపర్చడం, ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లడం, ప్రతి గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, యువతకు సామాజిక సేవ వైపు తీసుకు వెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. వయసు 18 నుంచి 29 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. అభ్యర్థులు మై భారత్ అధికారిక పోర్టల్ హెచ్‌టిటిటిపి//మై భారత్ జీవోవి ఇన్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించాలన్నారు. ఇందులో ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 20న తుది గడువు అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం ఐదువేలు, కాల వ్యవధి రెండేళ్లు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు మేరా యువ భారత్ ఖమ్మం కార్యాలయం, ఫోన్ నెం. 91773 29258 సంప్రదించాలన్నారు.

# మెడికల్ కాలేజీకి శరీర దానం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఖమ్మం మమత మెడికల్ కాలేజీకి శరీర దానం చేశారు. పెనుబల్లి మండలం వియం బంజరు గ్రామానికి చెందిన నాగుబండి సుశీల అనారోగ్యంతో మృతి చెందారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తపది వి. యం బంజరు లయన్స్ క్లబ్ సత్తుపల్లి వారు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఖమ్మం మమత మెడికల్ కాలేజీ కి మృతదేహాన్ని తరలించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చెర్పర్సన్ లయన్ ఎస్.కె అబ్దుల్ సలాం, ప్రెసిడెంట్ లయన్ శ్రీధరాల సుబ్బారావు, సెక్రటరీ లయన్ మిట్టపల్లి శ్రీధర్, క్లబ్ బాధ్యులు లయన్ అనుమోలు సాంబశివరావు, లయన్ మిట్టపల్లి నరేంద్ర, సత్తుపల్లి లయన్స్ క్లబ్ బాధ్యులు లయన్ ప్రభాకర్ రెడ్డి, లయన్ ఉమామహేశ్వరరెడ్డి, లయన్ పెనుగొండ రమేష్, లయన్ చల్లగుండ్ల అప్పారావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఈవి రమేష్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రెసిడెంట్ మిట్టపల్లి నరేంద్ర కుమార్, బాధిత కుటుంబ సభ్యురాలి కుమారుడు నాగుబండి కిషోర్ పాల్గొన్నారు.

# మై భారత్ పోర్టల్‌పై అవగాహన



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ పోర్టల్‌లో ఎలా నమోదు చేసుకోవాలి. పోర్టల్ ద్వారా లభించే వివిధ అవకాశాలు, యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి(స్కిల్ డవలప్‌మెంట్) కార్యక్రమాల గురించి విద్యార్థుల వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఖమ్మం జిల్లా మై భారత్ పోర్టల్ యూత్ ఇంచార్జి ఎం.రాంబాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎం.రాంబాబు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.ఇందిర, ఇంగ్లీష్ అధ్యాపకులు పి.శ్రీనివాస్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తాం

**-గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**
**-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**





**ప్రజాపక్షం/అశ్వాపురం:** సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు గోదావరి జలాలను అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం అశ్వాపురం మండలంలో సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనులను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, నిధుల అవసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులను సమన్వయంతో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు కీలకమని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి సుమారు 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలు వృథా కాకుండా వినియోగంలోకి తీసుకువచ్చి, రైతులకు ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్, ఎన్సీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్‌పీ రోహిత్‌రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

**-యువత సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు**






**ప్రజాపక్షం/కూసుమంచి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)నాయకులు డిమాండ్ చేశారు. లాల్ సింగ్ తండాలో మాజీ యువజన నాయకుడు భూక్యా నరసింహ అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో మాజీ యువజన నాయకుడు సంగబత్తుల ఉపేందర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్. మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఉద్యోగ నియామకాల జాప్యం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఖమ్మం జిల్లాలో హాస్టళ్లు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, క్రీడా సదుపాయాలు, ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని, జిల్లా కేంద్రంలో ఆధునిక యువజన అభివృద్ధి కేంద్రం, కెరీర్ గైడెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు మొదటి వారంలో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గుండెపంగు మల్లేష్, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, జిల్లా నాయకులు కిరణ్ శివ, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు భూక్య శ్రీకాంత్, ప్రసాద్, మల్సూర్, నాయకులు నాగయ్య, తెలు పిచ్చయ్య, బెల్లి హుస్సేన్, వీరబాబు, మోహన్, మహేష్, చంటి, నాగరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరే విద్యార్థులు.. ఓ ఉపాధ్యాయురాలు..!

**-పాఠశాలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు**
**-ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయురాలు**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని కోనయపాలెం ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులు ఉండటం గమనార్హం. ఆ ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయురాలు ఒకరే ఉన్నారు. ఈ పాఠశాలలో గత సంవత్సరం ఐదుగురు విద్యార్థులు చదువుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. వీరిద్దరిలో ఒకరు ఐదవ తరగతి మరొకరు మూడవ తరగతి చదువుతున్నారు. ఆ ఇద్దరు విద్యార్థులు పాఠశాలకు రాకుంటే ఉపాధ్యాయురాలు ఖాళీగా కూర్చోవాల్సి ఉంటుంది. అదే విధంగా శ్రీరామగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను పూర్తిగా మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలపై జిల్లా, మండల విద్యాశాఖ దృష్టి సారించిపోవడంతో పాఠశాలలో విద్యార్థుల శాతం తగ్గిపోవడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బడి బాట కార్యక్రమం పెట్టినప్పటికీ విద్యార్థుల శాతం మాత్రం పెరగకపోవడం సోచనీయం. మండలంలో మరికొన్ని పాఠశాలల్లో ఐదు నుంచి 10 మంది విద్యార్థులు ఉంటున్నారు. గతంలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కొరత ఏర్పడుతుంది.

# పాత గొడవ నేపథ్యంలో యువకుడిపై దాడి

**- కారు అద్దాలను ధ్వంసం చేసిన వైనం**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలో ఓ యువకుడిపై జరిగిన దాడి స్థానికంగా కలకలం రేపింది. చుంచుపల్లి పోలీసుల కథనం ప్రకారం, విద్యానగర్ కాలనీకి చెందిన రాహుల్‌కు రామాంజనేయ కాలనీకి చెందిన కోటేష్ అనే వ్యక్తితో సుమారు పది రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ ఘటనకు కొనసాగింపుగా గురువారం కోటేష్ తనలోపాటు మరో పదిమంది యువకులతో కలిసి రాహుల్ ఇంటి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కారులో ఉన్న రాహుల్‌ను బయటకు లాగి పాత గొడవను ప్రస్తావిస్తూ విచక్షణారహితంగా దుండగులు రాహుల్‌పై పిడిగుద్దులతో దాడి చేయడంతోపాటు అతడి కారుపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేసి, రామాంజనేయ కాలనీకి రాహుల్‌ని తీసుకెళ్లి కొట్టి గ్యాస్ గోడౌన్ వద్ద వదిలి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురై వెంటనే డయల్100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాయపడిన రాహుల్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చుంచుపల్లి ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి గల పూర్తి కారణాలు, ఘటనలో పాల్గొన్న ఇతర యువకుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయంశంగా మారింది.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

**-రైతులకు సూచించిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల వరి పంటలపై ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. కూసుమంచి మండలం నర్సింహులగూడెం గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాల ఆలస్యంతో రైతులు నష్టపోకుండా పెసర, కంది, జొన్న, ఆముదం వంటి తక్కువ కాల వ్యవధి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల్లో ఫార్మ్ పాండ్లు(వ్యవసాయ నీటి కుంటలు)నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకోవచ్చని తెలిపారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, పంటల స్థిర దిగుబడులకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి జానీ, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు..




**ప్రజాపక్షం/కరకగూడెం:** కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చలో మణుగూరు కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కరకగూడెం మండల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు రావుల సోమయ్య, బుడగం రాము, రేగా సత్యనారాయణ, కొమరం రాంబాబు, కొమరం సత్యనారాయణ, రావుల కనకయ్య, అత్తె సత్యనారాయణ, మలకం వెంకటేశ్వర్లు, గుడ్ల రంజిత్ కుమార్, పాయం నర్సింహారావు, పాయం క్రిష్ణ, దాసరి సాంబయ్య, చిట్టిమల్ల ప్రవీణ్, బందు సతీష్ లను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదని, జిల్లా రైతాంగానికి నీళ్లు ఇచ్చేదాకా పోరాటం ఆగే ప్రసక్తి లేదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# ప్రతీ రహదారి పచ్చని తోరణాలుగా ఉండాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ రహదారి పచ్చని తోరణాలు గా ఉండాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య ఆదేశించారు. మండలంలోని చెన్నారం లో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు రక్షణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీలలో రహదారులకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్క ను సంరక్షించేందుకు కంచె ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పచ్చటి చెట్లతో పచ్చని తివాచీల స్వాగతం పలుకుతున్నట్లుగా ప్రతీ గ్రామంలో ఉండేలా కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా నర్సరీలలో మొక్కలకు రక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు ఘటనలో ముగ్గురు దుర్మరణం



**ప్రజాపక్షం/పాల్వంచ :** రెండు వేరు వేరు ఘటనల్లో ఓ యువకుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన ఘటన పాల్వంచలో గురువారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన ప్రకారం మండల పరిధి జగన్నాథపురం గ్రామానికి చెందిన తోట అరవింద్ కుమార్ (28 ) తోగ్గూడెం దగ్గరలోని మిషన్ భగీరథలో పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15వ, తేదీ రాత్రి సొంత పని నిమిత్తం జగన్నాథపురంనుండి పాల్వంచకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇందిరానగర్ కాలనీ ఇందిరాగాంధీ విగ్ర హం వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా యూటర్న్ తీసుకొని భద్రాచలం వైపు నుండి పాల్వంచకు వస్తున్న బైక్‌ను అరవింద్ కుమార్ బైక్ బలంగా ఢీకొట్టింది. దీనితో రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే క్షతగాత్రుడిని హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ వైద్యశాల తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. దీనితో మృతుడి అన్న తోట శివకుమార్ ఫిర్యాదు మేరకు పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా లక్ష్మిదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన ఈసం జనార్ధన్ (45)తేజావత్ దూదియా (45) తో కలిసి వ్యవసాయ పను ముట్లు కోసం బైక్‌పై పాల్వంచ కు వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళుతున్నారు. నవభారత్‌కు చేరుకోగానే యూటర్న్ తీసుకొని భోజనం చేయటానికి హోటల్‌కు వెళ్ళే క్రమంలో కొత్తగూడెం వైపు నుండి పాల్వంచకు వస్తున్న ఆర్‌టిసి బస్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. దీనితో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతుడు జనార్ధన్ కుమారుడు ఈసం భిక్షం ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ. తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సత్తుపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాగమయి గురువారం హాజరయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 2017లో వైద్యురాలిగా పనిచేసిన సమయంలో చికిత్స పొందిన ఓ రోగికి సంబంధించిన కేసులో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సాక్షిగా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూకలకుంట రవి, న్యాయవాదులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం న్యాయవాదులతో పలు సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు.

# ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుకు చర్యలు



## విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించిన వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు చర్యలు వేగవంతమవుతున్నాయి. ఈ నేపద్యంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటిపై నుంచి ప్రమాదకరంగా వెళుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్‌ల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కాలనీలో ఎన్ని కొత్త స్తంభాలు అవసరమవుతాయో, ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే విషయాలపై అధికారులు అంచనా(ఎస్టిమేట్) సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ మ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కాలనీలో ప్రతి గల్లీకి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పరిశీలనలో విద్యుత్‌శాఖ డిఈ రమేష్, ఏడిఏ కిరణ్, సబ్ ఇంజనీర్ నరేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ జార్జ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

## వ్యవసాయాధికారి రాధ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భజలాల క్షీణతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రామచంద్రాపురం, ఆచార్లగూడెం గ్రామాలలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షపాతం తక్కువగా ఉన్న తరుణంలో నీటి లభ్యతను బట్టి రైతులు తమ పంటల ప్రణాళికను మార్చుకోవాలన్నారు. వరికి బదులుగా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే ఆరుతడి పంటలైన పెసర, కంది, మినుములు, నువ్వులు, కొర్రలు, జొన్నలు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతుల పొలాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో పంట కుంటలను ఏర్పాటు చేస్తోం



దని రాధ తెలిపారు. ఈ కుంటల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని పంటలకు అవసరమైన సమయంలో వాడుకోవచ్చని, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుందని వివరించారు. ఈ సువర్ణ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారులు యం. శివ, దుర్గాభవాని, రైతు ప్రతినిధులు గరిడేపల్లి రామారావు, మాగం సైదులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో దశలవారీగా సిసి రోడ్ల నిర్మాణం చేపడతాం



## చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధజలోని 18వ వార్డులో సిసి రోడ్ల నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ భూమిపూజ నిర్వహించారు. ఈ భూమి పూజను మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వార్డు కౌన్సిలర్ గోరంట్ల శ్రీదేవితో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దశలవారీగా సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామచందర్‌రావు, గోరంట్ల పిచ్చారావు, 19వ వార్డు కౌన్సిలర్ చింతనిప్పు సులోచన, చింతనిప్పు చలపతి, తోటకూర శ్రీకాంత్, శ్రీనాథ్, నంద్యాల శ్రీనివాసరావు, గోరంట్ల లక్ష్మి నారాయణ, షేక్ ఇమామ్ సాహెబ్, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పరిశీలన

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండలంలోని ముత్తాపురం, అనంతోగు, రాయపాడు, ఆళ్లపల్లి గ్రా మాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతి నిధులు పరిశీలించారు. ఈసందర్భంగా బూత్ స్థాయి అధికారులను కలిసి కార్యక్ర మం అమలు తీరును అడిగి తెలుసుకుని, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారాలు నింపడంలో అవగాహన లేని వారికి బీఎల్ఓలు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ ప్రోగ్రాం ఇంచార్జ్, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, ఉప సర్పంచులు నాగేష్, ఆరిఫ్, రఘుపతి, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, నాయకులు నరసింహారావు, బాబా, వెంకటేశ్వర్లు, కిషోర్ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతులు తొందరపడి

# వరి పంటలు సాగు చేయవద్దు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ముసలిమడుగు గ్రామంలో ఎలినినో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ ఎలినినో ప్రభావంపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఈ వానాకాలం సీజన్‌లో వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని పంటల సాగు చేయాలని సూచించారు. జులై15 నుండి 30 వరకు వర్షాభావన సూచన లేదని



ఎవరైనా వరి వేయాలని సిద్ధం అవుతున్న రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలుగా మినిము, కంది, అపరాల సాగు వైపు దృష్టి పెట్టాలని సూచించారు. వరి పంటకు సరిపడా నీరు ప్రస్తుతం ఎక్కడ లేవని సూచించారు. అదేవిధంగా భూగర్భ జలాలు నీటిని సంవృద్ధిగా అందించే అవకాశం కూడా తక్కువగా ఉందని ఎవరు త్వరపడి నార్లు పోయకూడదని అన్నారు. పంట కుంటలకు ప్రతిఒక్క రైతు 5 ఎకరాల లోపు పొలం ఉండి ఉపాధిహామీ కార్డు ఉన్న రైతులు దీనికి అర్హులు పంట కుంటలు అనేవి రైతులుక చాలా ఉపయోగకరం అని వీటి ద్వారా వాటర్ రీచార్జ్ అవుతుంది. ఎవరైనా బోర్ ద్వారా వ్యవసాయం చేసే రైతులకు పంట కుంట అనేది వాటర్‌గా ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అనిల్‌కుమార్, గ్రామ సర్పంచ్ తడికమళ్ళ నాగార్జున్, వ్యవసాయ విస్తరణ అధికారి పరిటాల వెంకటనర్సయ్య, కేతవరపు కృష్ణయ్య, చింతనిప్పు శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి కోర్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ గది, క్యాంటీన్, కార్ షెడ్, సీసీ రోడ్డు, వ్యాజ్యదారుల కోసం ప్రజా విశ్రాంతి గది నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం కింద నిధులు మంజూరు చేయాలని కోరుతూ సత్తుపల్లి బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాదులు గురువారం ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సత్తుపల్లి కోర్టు సముదాయంలో ఐదు కోర్టులు పనిచేస్తుండగా, ప్రతిరోజూ వందలాది మంది వ్యాజ్యదారులు, ప్రజలు కోర్టుకు వస్తున్నప్పటికీ కనీస మౌలిక సదుపాయాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి శాఖ రూ.63 లక్షలతో అంచనాలు సిద్ధం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బార్ అసోషియేషన్ అద్యక్షులు కూకలకుంట రవి, ఉపాధ్యక్షులు కటికాల వెంకటేశ్వర్లు, జాయింట్ కార్యదర్శి వంకదారు రామకృష్ణ, ట్రెజరర్ కొప్పుల కేశవరెడ్డి, బాషా, సీతారామయ్య పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం ఆరెంపుల పంచాయతీపరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. మేడా రవీందర్ అనే ప్రైవేట్ ఎలక్ట్రీషన్ విద్యుత్ స్తంభంపై మరమ్మత్తు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో కిందిపడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమచారం. ఈ ఘటనపై గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రీషన్ అయిన రవీందర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు పనుల కోసం తీసుకువచ్చారని, సరైన భద్రతా చర్యలు పాటించకపోవడం వల్లే ఈ పమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాదం జరిగిన అనంతరం బాధితుడిని పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారని కూడా స్థానికులు ఆరోపించారు. ఘటనై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గ్రానైట్ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 8మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, తహశీల్దార్ సునీత ఎలిజబెత్, ఎంపిడిఓ శారదలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి పెళ్లిలు చేసుకున్న ఆడ పిల్లలకు ఇస్తున్న కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ పథకాలు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, శిరీష, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, శీలం వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు అన్నపూర్ణ, రాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ పాఠశాలలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఏజెన్సీ ప్రాంత పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ)రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటీఏ సభ్యత్వ నమోదు జనరల్ ఫండ్ క్యాంపెయినింగ్‌లో భాగంగా దుమ్ముగూడెం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఆయన, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మారాయిగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏటీఏ జిల్లా సంయుక్త కార్యదర్శి కొర్స చిట్టిబాబు, ఏటీఏ రాష్ట్ర కోశాధికారి సోయం హనుమంతరావు, మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి పూనెం రమేష్, కొర్స వెంకటరమణ, పూసం హిందులత, సోడి సత్యప్రసాద్, రాంబాబు, తుర్రం నరసింహారావు, తెల్లం పొద్దయ్య, వర్స వసంతరావు, సీతయ్య, పూనెం నరేష్, అపక దుర్గారాజు, ఇర్ప నరసింహమూర్తి, అపక బాలరాజు, పాయం శ్రీను, గొర్రె రామకృష్ణ, పెనుబల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పోరాటం ఆగదు



**ప్రజాపక్షం/ఇల్లందు:** సీతారామ ప్రాజెక్టు పర్యటన సందర్భంగా రైతు సమస్యలపై ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు, ఇల్లందు మాజీ ఎంఎల్ఏ, పార్టీ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియనాయక్ ఆదేశాల మేరకు మణుగూరులో నిరసనకు వెళ్తుండగా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా సిలివేరి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ యాదవ్, మీర్జా బేగ్, ఎస్‌కె చాంద్ పాషా, రవికాంత్, బాసాని రాములు, పూదూరి లక్ష్మి నారాయణ, నీలం రాజేష్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.